

# రెండు ఎర్రని గాలిపటాలు





ఆ గురువారం, సాయంకాలం లక్ష్మణ్ స్టూడియోకి రమ్మని కబురు చేశాడు శివరామ్. రేపో, మరునాడో జరగబోయే ఒక మీటింగ్‌కి రిహార్సల్ అది.

చాలా కవితలు, రెండో, మూడో ఉపన్యాసాలు వినాలి. ఒక దుఃఖాన్ని ఇంత నాటకీయంగా పాక్ చెయ్యటం; ఈ సిటీ నుంచే దూరంగా పారిపోవాలని కోరిక కలిగింది.

అయితే అహమ్మద్, మా హీరో. తన బొమ్మల కోసమే ఆ రిహార్సల్‌కి వెళ్ళాను. ముందుగా సెప్టెంబరు పదకొండు గురించిన యుద్ధ కవితలతో గొప్ప ఉత్సాహాన్ని రగిలించాడు దేశి. చుట్టుపక్కల ఇళ్ళన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి.

దూరంగా ఎక్కడో మసీదులోంచి 'అజా' వినిపిస్తోంది. రోడ్డు పైన తోపుడు బళ్ళు, ఒంటరి ముసలికుక్క దాని వెంట భీకరంగా అరుస్తూ పరిగెడుతున్న నాలుగైదు బలిసిన కుక్కలు. శివరామ్ దీక్షగా ఒక నిరసన పత్రాన్ని తయారుచేస్తున్నాడు. ముఖం ఎర్రగా ఉంది. కోపంతో పెదవి వణుకుతోంది. "కవులం, రచయితలం, సామాజిక కార్యకర్తలం..." అంటూ మొదలైన నిరసన పత్రం సుమారు రెండు పేజీలుంది. "దీనిపై సంతకం పెట్టు" అంటూ కాగితం నావైపు తోశాడు. గబగబా మూడు సంతకాలు పెట్టేను. "ఒకటి నాది, మిగిలిన రెండూ నా కథల్లోని పాత్రలు మోహిని, మోహనసుందరాలవి!" అన్నాను గంభీరంగా. అతని ముఖంలో అసహనం. అహమ్మద్, మనోహర, మూర్తి పెయింటింగ్స్‌ని సర్దుతున్నారు. కోమలి ఓ మూలన కూర్చుని కవిత రాసుకొంటోంది. అప్పుడే వచ్చిన సదాశివ, వస్తూనే కిటికీ తలుపులన్నీ తెరిచి, కర్టెన్లు తీసి, దీపాలు వెలిగించి బ్రహ్మాండమైన కాంతిని ఒక్కసారిగా గదిలో ప్రవేశపెట్టాడు.

అహమ్మద్ వేసినవన్నీ ఆయిల్ పెయింటింగ్స్. పదిదాకా ఉన్నాయి. ఒక్కొక్కటి ఒక మానవగాథ. నరికివెయ్యబడ్డ అవయవాల గుట్టలు. కాళ్ళు, చేతులు, శిరస్సు, వక్షాలు. ఆ గుట్టల మధ్యన తమ శరీర భాగాలు వెతుక్కొంటున్న వికలాంగులు. ఇంకొకటి, చుట్టూ ముళ్ళకంచె. బయట సైనికుల కవాతు. ముళ్ళకంచెపై రెండు చేతులు బిగించి, రక్తం కారుతుండగా, "బేటా! తు కిదర్‌హై!" అంటూ ఆచూకీ తెలియని బిడ్డకోసం ఏడ్చే తల్లి. మరొకటి, ఒంటరిగా నడిచి వెళుతూ, అది తగలబడుతున్న శిశువు.

ఆ పెయింటింగ్స్‌ని పక్కనే ఉన్న రెండు ఎర్రని గాలిపటాలపై నా దృష్టి పడింది. పాడవాటి రంగుల రెక్కలతో, మానవ హృదయంలా ఉన్నాయవి.

వాతావరణంలోకి కోమలి ఒక కవితను ప్రవేశపెట్టింది. పూర్తికాని కవిత. శకలాలు శకలాలుగా ఆ కవిత స్టూడియో అంతా వెదజల్లబడింది.

మనం అదృశ్యమయ్యి / లేక సమూలంగా నిర్మూలనమయ్యి / మరణపు భావనగా మిగిలిపోయే / ఒక మహా నిశ్శబ్దం.

చర్మాన్ని ఒలిచి, రక్తం, మాంసం / సమస్తమూ మంటల మధ్యన / ఈ దహనక్రియేనా మరణం / తగలబడుతుంది రక్తమూ కాదు / పోనీ ఎముకలూ కాదు / భూగోళంపై చివరి మానవుడు / తగలబడుతున్న సందర్భమిది.

గదంతా గుజరాత్‌లా మారిపోయింది. శివరామ్ గుజరాత్ విధ్వంసం ఫోటోలు నేలపై పరిచాడు. ఒక్కో ఫోటో ఒక్కో కథ. ఒక విపత్తు. ఒక మరణం. శివరామ్ వివరిస్తూనే ఉన్నాడు.

రాత్రి దీర్ఘమైంది. సదాశివ కవితను చదవటం మొదలుపెట్టాడు. కళ్ళ ముందో దృశ్యం, పెనుమంటై, భయం గొలిపిందా కవిత. అంతలోనే మూర్తి కవిత గదిని ఆవహించింది.

హఠాత్తుగా శివరామ్ గొంతు సవరించుకొని "ఈ కత వినండి. ఆ ఊరిలోకి ప్రవేశిస్తూనే మాకు ఆమె అరుపులు వినిపించాయి. మాకు ఆమెను చూపించండి అన్నాం. ఆమె ఇప్పుడు లేదు అన్నారు. ఆమె కథలు అమ్ముకు బతికే వీధి గాయని. పోనీ వాళ్ళ భాషలో బిచ్చగత్తె. ఫాతిమా ఆమె పేరు. ఊరంతా ఆమె కథే చెబుతున్నారు. ఆ కథ మీకు చెప్పాలి" అన్నాడు.

* * *

మనుషులు నిరవధికంగా కాలుతున్న సందర్భం. ఇళ్ళు లేవు. చిరునామాలు లేవు. సరి, ఆ కథ అట్లా ఉంచితే, సహాయ శిబిరాల బయట ఒక వీధి బిచ్చగత్తె, మసీదు ముందర పాటలుపాడే, కథలు పాడే గాయని. ఫాతిమా ఆమె పేరు. ఆటోలో రెండు మూడు రొట్టెల మూటలతో దిగుతుంది. శిబిరాల్లో ఆకలిగొన్న పిల్లలందరినీ వెంట తీసుకువెళ్ళి రోటీలు పంచుతుంది. వాళ్ళ కథలన్నీ వింటుంది. మరుసటి రోజుకి అవన్నీ పాటలై వీధివీధి తిరుగుతాయి. ఆమెకు పోలీసన్నా, మిలిటరీ అన్నా భయం లేదు. వాళ్ళ మధ్య కూడా 'గుజరాత్ పాటలు' పాడి వినిపిస్తుంది.

మసీదు పక్కన ఆమెకో ఇల్లుంది. ఆ యిల్లు ఇప్పుడొక పిల్లల శిబిరమైంది. కనీసం వందమందైనా ఆ యింట్లో ఉండి ఉంటారు. అంతమందికీ రోటీ, సబ్జీ అందిస్తుంది. గోధుమలు ఎక్కడ నుంచి వస్తాయో అర్థంకాదు. ఒకసారి కలెక్టరు బంగళా ముందు తన పాటల దుకాణం పెట్టింది. ఎంతమంది

పోలీసులు వచ్చినా బెదరలేదు. చివరకు కలెక్టరు బయటకు వచ్చి, ఆమె కథ లన్నీ విని, పిల్లల కోసం పదికిలోల గోధుమలు రేషన్‌గా ఇచ్చాడు.

అయితే ఊళ్ళోవాళ్ళకు ఆశ్చర్యం కలిగించే విషయం, ఫాతిమా రోజు రోజుకీ చిక్కిపోయి, ఎముకలపోగులా అయిపోవటం. 'ఆమె తిండి తినడం మానివేసింది' అని ఊరంతా చెప్పుకొంటారు. ఆ ఒక్క గింజయినా పిల్లల కోసం మిగల్చాలని ఆమె ఆరాటం.

నెల గడిచింది. పిల్లల తల్లిదండ్రుల ఆచూకీ తెలియలేదు. పిల్లలు ఇళ్ళకు వెళ్ళే పరిస్థితి లేదు. పదికిలోల రేషన్ అయిపోయింది. ఇప్పుడు ఇంటిం టికీ బిచ్చమెత్తుకోవటం మొదలుపెట్టింది. ఒక్కతే అట్లా పాటలు పాడుతూనే ఉంటుంది. ఆశువుగా, ఒక్కొక్క మరణం ఒక పాట, ఒక్కొక్క వీధి ఒక పాట. ఆ పాటకు కరగని గుండె లేదు. సాయంకాలానికి గోధుమల్తో ఇంటికి వస్తుంది. పిల్లల్ని ఆకలితో పెట్టిన సందర్భాలు లేవు. ఫాతిమా మాత్రం రోజురోజుకీ క్షీణించి, ఫాతిమా అనే మనిషిలా కాకుండా ఫాతిమా అనే భావనగా మిగిలిపోయింది.

ఇంట్లో పిల్లల సంఖ్య రెండు వందలు దాటింది. అయితే అంతమందికీ ఏనాడూ తిండి లోటు లేదు. ఒకరోజు ఆ పిల్లల్లో ఒకడు, ఇంకోడి మెడ కొరికి వేశాడు. ఇల్లంతా రక్తం. పిల్లల అరుపులు, ఏడుపులు. అప్పుడు పోలీసు అధికార్లు వచ్చారు. ఫాతిమాని జైలుకు తెచ్చారు. పిల్లల్ని మళ్ళీ గవర్నమెంటు శిబిరాలకు పంపివేశారు. ఆ తరువాత ఫాతిమా ఏమైందో తెలియలేదు. ఆమె పాటలు ఇంకా వీధుల్లో వినిపిస్తూనే ఉంటాయని చెప్పుకొంటారు. ఆమె ఇల్లు ఇప్పుడు ఒక మ్యూజియం. ఇంటి ముందు ఇద్దరు ముగ్గురు పిల్లలు ఆమె కథనే పాటలుగా వినిపిస్తూ ఉంటారు.

* * *

శివరామ్ ముగిస్తూనే, సదాశివ మరో గుజరాత్ సందర్భాన్ని చెప్పటం మొదలుపెట్టాడు. బయట గాఢమైన చీకటి. ప్రకాశవంతమైన వెలుగు ధారగా జారిపడుతోంది దీపాల మీదుగా. గోడకు ఆనుకొని నల్లని కిటికీని, కిటికీలోంచి కనిపిస్తున్న ఒంటరి దీపాన్ని చూస్తుండిపోయాను. అంత వెలుతురున్నా, అది వెలుతురు అందని చోటులాగే ఉంది. సదాశివ గొంతు వినిపిస్తుంది గానీ, అది మాటలన్నీ లాగివేసుకోబడ్డ మూగవాడి గొంతుకలా ఉంది.

స్టూడియో బయట నలుగురు బాలెడ్ గాయకులు కూర్చొని ఉన్నారు. అకల్మషమైన పల్లెల గాత్రాన్ని మోసుకు వచ్చారు వాళ్ళు. వాళ్ళ గొంతుకలు కూడా వినాల్సి ఉంది. కనబడని దుఃఖం, కథలు కథలుగా స్టూడియో అంతా నిండిపోయింది.

"నువ్వే కథ చెప్పు!" అన్నాడు సదాశివ ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

"నేను గుజరాత్ వెళ్ళలేదు. ఆ మరణాల్ని చూడలేదు. ఆ దుఃఖాన్ని చూడలేదు. పోనీ, నేరుగా విననూ లేదు. ఇట్లా తీవ్రమైన జ్ఞాపకాలు, నిశ్శబ్ద గానాలు కథలుగా మారలేవు!" అని అన్నాను గానీ, ఒక ఉద్వేగం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంది. "ఉద్వేగాల్నే కథగా మార్చు" అంది కోమలి నన్ను ఉత్సాహపరుస్తూ. గాఢంగా నిట్టూర్చి, ఒక కథను లోలోపలే డిజైన్ చేసుకొని, సాంద్రమైన రాత్రిలోకి ఆ కథను ప్రవేశపెట్టాను.

* * *

కారు, మనుషులు, ఒకటో రెండో, ఇద్దరో నలుగురో - ఆకాశం నీలంగా, మౌనంగా, సన్నని మంటలాగా సూర్యుడు. అట్లా ఆకాశం వైపుకు చూస్తూ, క్రమక్రమంగా పెద్దదవుతున్న తన నీడను చూస్తూ ఉక్రోషపడ్డాడు హమీద్. హఠాత్తుగా లోపలి నుంచి ఏదో మంట ఎగిసి, రోడ్డు పొడవునా సాగిన నీడను కూడదీసుకొని కోపంగా ముందుకు నడిచాడు. చెవుల చుట్టూ వేడిగాలి. శరీరం పొడవునా సూదులతో గుచ్చినట్లుగా బాధ. హమీద్ పాదం వేగంగా కదులుతుంది. మనుషులు, కార్లు, ఇళ్ళు ఏవీ కనబడలేదు. పూనికతో, మహా ఆవేశంతో ఇంట్లోకి పరిగెత్తాడు. గదుల్లోనూ, వరండాల్లోనూ కుప్పలు పోసినట్లుగా పిల్లలు. ఫాతిమా అమ్మీ ఇంట్లో ఉన్నట్లు లేదు. గదిలో ఒక మూలన తన సంచిలో రహస్యంగా దాచిన చెక్క పిస్తోలును బయటకు తీశాడు హమీద్. హలీవుడ్ సినిమాలోలాగా తుపాకీని వేలు మధ్యన పెట్టుకొని గిర్రు మంటూ తిప్పి, సన్నని వంకర నవ్వు పెదాలపై అతికించుకొని, ఇంటి బయటకు వచ్చాడు. వచ్చి తీవ్రంగా, మహా క్రోధంగా మండుతున్న సూర్యుడివైపు తుపాకీని చూపి, ఇమాజినరీ బుల్లెట్లు తుపాకీలో నింపి, మూడుసార్లు, గురి తప్పని తన ప్రావీణ్యంతో, సూర్యుడివైపు పేల్చాడు. ఏ ప్రతిఘటనా లేకుండా చచ్చిపోయాడు సూర్యుడు.

క్రమంగా ఆకాశంలో నల్లని తెరలేవో కమ్ముకోవటం గమనించాడు. హమీద్‌లో గొప్ప ఉత్సాహం. ఉత్సాహాన్నీ లోపలే అణుచుకొని లోపలికి నడిచాడు. పిల్లల గుట్టల్ని దాటుకొని వెళ్ళాడు. రషీద్ కోసం వెతికాడు. ఎక్కడా కనబడలేదు. సూర్యుడి మరణం గురించి రషీద్‌కి చెప్పాలని ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు హమీద్. ఇంటి వెనకాల ఉన్న రషీద్ ప్రయోగశాల వైపుకు నడిచాడు.

పెరట్లో ఇంకా కొద్దిగా వెలుతురు. పైన ఆకాశంలో సగం చచ్చిన సూర్యుడు. మోకాళ్ళపై కూర్చుని, చుట్టూ పచ్చిక, ఆకుపచ్చగా నవనవలాడుతూ

కలలోని తివాచీలాగా, పచ్చిక చుట్టూ కట్రలతో ఇమాజినరీ గోడ కట్టుకొన్నాడు రషీద్. సూర్యుడు చచ్చిపోయిన సంగతి అర్థమయింది రషీద్‌కి. వెలుతురు తగ్గి, నల్లని నీడలు పైకి పాకటం తెలుస్తోంది రషీద్‌కి. సరిగ్గా ఆరు అడుగుల అవతల, ఎలుక పిల్ల పచ్చికపై ఆడుకొంటూ, రషీద్ ముఖాన్ని వెలిగించాడు. తత్వవేత్తలకు చెందిన యోగభ్రమను కలిగిన నవ్వును పెదాలకు అతికించు కొన్నాడు. ఇమాజి నరీ కట్రగోడలను ముందుకు జరుపుతూ, పచ్చికపై ఆడుకొం టున్న ఎలుక పిల్లకింకా ఏమీ తెలియదు. రషీద్ మెడను పొడుగ్గా ముందుకు చాపి, మెడను కొద్దిగా పైకెత్తి, తలను ముందుకు జరిపి, ముఖాన్ని కూడా పొడవుగా చాపి, రషీద్ ముఖంలో బ్రహ్మాండమైన కాంతి. యోగులకే సాధ్య మయిన నవ్వుతో పెదాలు విచ్చుకొని, పళ్ళు తళతళలాడాయి. తనవైపుకు తోసుకువస్తున్న ముఖాన్ని, దాని పైని యోగకారుని నవ్వును చూసి కొద్దిగా కంగారుపడి వెనక్కు గెంతింది ఎలుక. అప్పటికే ఆలస్యమైంది.

ముందుకు సాగిన మెడ హఠాత్తుగా ఎలుకపైబడి, రషీద్ పదును పళ్ళ మధ్యన ఎలుక గిలగిలలాడింది. తన పాదాలతో రషీద్ ముఖాన్ని రక్కింది. రషీద్‌పళ్ళు దాని శరీరంలోకి బలంగా దిగి, బలమైన కత్తి అది. రషీద్ పెదాల మధ్యన రక్తం. ఎలుక గిలగిలలాడుతూనే ఉంది.

మసీదు వీధి, మాంసం దుకాణం, టీషాపు, కుర్చీ, ప్రేమికుల పార్కు, గాంధీ విగ్రహం, మంచాలు, గోడలు, ప్రశాంతమైన నిద్ర, అన్నీ క్రమంగా అదృశ్యమయి - రక్తం మరక, ప్రాణం వదులుతున్న దృశ్యం, కాలిన చర్మం వాసన, పెట్రోలు, సి.ఎన్.జి. గ్యాస్, తరుముకొస్తున్న మంట - అవి కూడా క్రమంగా అదృశ్యమయి; రషీద్ ముఖంలో యోగులకే సాధ్యమైన ప్రశాంతత.

"మర్‌గయా క్యా?" హమీద్ ఆత్రంగా అడిగేడు. రషీద్ ముఖంలో ప్రశాంతత చెదరలేదు. కళ్ళు పైకెత్తి, ముఖాన్ని మళ్ళీ గుండ్రంగా మడిచి, పెదాలు విప్పి, బిగించిన పళ్ళను తెరిచాడు. నిర్జీవమైన ఎలుక శవం జారి పచ్చికపై పడింది. "ఇత్నా బేవకూఫ్ హై ఏ లోగ్! వో సాలా సూరజ్ భీ ఐసా హై! పెహలే బుల్లెట్ సేహీ మర్‌గయా!" అన్నాడు. రషీద్ వివరాలేమీ అడగలేదు. పెరట్లో గోడకు ఆనుకొని, తన పళ్ళను పదును పెట్టుకోవటం మొదలుపెట్టాడు.

సాయంకాలం అదృశ్యమైంది. ఆకాశంలోంచి కొద్దిగా కిందకు జారి, చేతికి అందేంత దగ్గరలో వేలాడుతున్నాడు చంద్రుడు. అతనికి తోడుగా రోడ్లపై నియాన్ లైట్లు. హమీద్ చేతిలో ఇంకా చెక్కపిస్తోలు. దాన్ని సినిమాలోలాగా నిక్కరుపైన బొడ్లో దోపుకొని, ఫాతిమా అమ్మీ కోసం ఎదురుచూస్తుండగా, రషీద్ ఇంకా యోగిలాగే ముఖాన్ని వెలిగించి గదిలోకి వచ్చాడు. పిల్లలందరూ స్నానాలు చేసి, భోజనం కోసం, అమ్మీ రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఏడు

గంటలకు ఫాతిమా వచ్చింది. అలిసిపోయిన ముఖంలో కాస్త ఓపిక రగిలించి వంటగది వైపు నడిచింది. ఎదురైన రషీద్‌ని దగ్గరకు తీసుకొని, తల నిమిరి "దవా ఖాలియా?" అని అడిగింది. రషీద్ ఇంకా యోగమాయను నటిస్తున్నాడు. హమీద్ కలగజేసుకొని, తమ్ముడికి బిళ్ళలు వెయ్యటం, రోజంతా తుపాకీతో ఇంటిని కాపలా కాయటం, సాయంకాలం సూర్యుడిపై కాల్పులు జరపటం అన్నీ వివరించాడు. ఇంకో పదిమంది పిల్లలతో కలిసి వంటగదిలోకి నడిచాడు హమీద్ పిండి కలపడానికి, రొట్టెలు చెయ్యడానికి.

బయటి బజార్ల నిండా మనుషుల, కార్ల చప్పుడు. గొడవ గొడవగా ఉంది. హమీదుకి కొంచెం కంగారుగా ఉంది. మాటిమాటికీ కిటికీలోంచి తొంగి చూస్తున్నాడు. బొడ్డులోని తుపాకీని పదేపదే చేతితో తడుముకొంటు న్నాడు. తనే కాపాడాలి అమ్మీని, ఈ వందమంది తమ్ముళ్ళను అనుకొన్నాడు. అవసరమైతే కాల్చి పారేయాలి అని కూడా అనుకొన్నాడు. రోడ్డుపైన మనుషుల నీడలు, కిటికీల్లోంచి, తలుపు సందుల్లోంచి ఇంట్లోకి జొరబడి, నీడలు తళుక్కు మన్నప్పుడల్లా ఉలిక్కి పడుతున్నాడు హమీద్. కొద్దిగా బిగుసుకుపోయి, లేచి నిలబడి మార్చింగ్ ఫోజులో నిలబడి, తుపాకీ మడమను ఒకసారి తడుముకొని, పెద్దగా "సబ్ ఠీక్ హై!" అని అరిచాడు. అమ్మీ కంగారుపడుతూ హమీద్‌వైపు చూసింది. గాఢంగా నిట్టూర్చి, ఇది సురక్షిత ప్రదేశమని, ఇంకేమీ ప్రమాదం లేదని వాడికి చెప్పాలని ప్రయత్నించి అంతలోనే దుఃఖం పొంగివచ్చి మాట్లాడ లేకపోయింది. "సబ్ ఠీక్ హై!" అంటూ మరోసారి అరిచాడు హమీద్.

ఆరు గంటల ఉదయం. వీధులన్నీ అలారం వాచ్‌లా ట్రింగ్ ట్రింగ్ మంటున్నాయి. హమీద్ ఇంకా పక్కనే ఉన్నాడు. అతని పక్కనే పడుకొన్న రషీద్ హఠాత్తుగా లేచి, దుప్పటిని పక్కకు లాగి, ఇంటి వెనుకవైపుకు మోకాళ్ళపై వంగి జంతువులా పాక్కొంటూ, అచ్చం ఎలుకలాగే అటూ ఇటూ కంగారుగా చూస్తూ వెళుతున్నాడు. గమ్మత్తుగా ఉంది హమీదుకు. ఇంటి వెనుక రషీద్‌కు ఒక రహస్యమైన గ్యారేజి ఉంది. అది రషీద్ ప్రయోగశాల. గ్యారేజి పొడవునా విరిగిన పుల్లలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఇనుప ముక్కలు గుట్టలు పోసి ఉన్నాయి. చచ్చిపడిన ఎలుకలో, బొద్దింకలో, బల్లులో అక్కడపడి ఉండేవి. పొద్దున్నే అమ్మీ వాటిని ఊడ్చి వేసింది. పాక్కొంటూ గ్యారేజికి వచ్చిన రషీద్ ఖాళీ అయిన గ్యారేజిని చూసి "బత్తమీజ్!" అని గొంతులోనే నాలుగైదుసార్లు తిట్టుకొని, మళ్ళీ కొత్త జంతువుకోసం వెతకటం మొదలుపెట్టాడు. అటూ ఇటూ పరిగెడు తున్న బొద్దింక పిల్ల కనబడింది. మెల్లగా చేతుల్ని ముందుకు జరిపి, తటాలున దాన్ని అందుకొని "అబ్ దేఖో..." అనుకొన్నాడు. ఉత్సాహంగా గ్యారేజి మూలలో ఉన్న పనిముట్ల దగ్గరకు వెళ్ళాడు. రేకుడబ్బాలోని పెట్రోలు తీసుకొని దాని

వంటిపై పోశాడు. గుప్పుమంది పెట్రోలు వాసన. "అబ్ దేఖో మజా...." అనుకొన్నాడు పరమ ఉత్సాహంగా. పెట్రోలుతో తడిసిన బొద్దింక ఉక్కిరిబిక్కిరి అయి, రెక్కలు టపటపలాడించుకొంటూ – రషీద్ ముఖంలో నవ్వు క్రమంగా మనోహరమైన ప్రశాంతతగా మారింది. యోగ మహరాజ్‌గా మారాడు. అగ్గిపుల్ల తీసి దానిపై వేశాడు. అప్పుడే బయటకు వచ్చిన హమీద్ ఆ దృశ్యాన్ని చూసి కెవ్వుమని అరిచాడు. "అమ్మీ, అమ్మీ" అని పెద్దగా కేకలు వేశాడు. నిద్రపోతున్న పిల్లలు కంగారుగా లేచి వచ్చారు. భయంతో బిగుసుకుపోయాడు హమీద్. ఒళ్ళంతా చెమటలు. కళ్ళ నిండా పెనుభయం. "నై.... నైయీ" అంటూ కేకలు వేసుకొంటూ రోడ్డు పైకి పరిగెత్తాడు. బొద్దింక శవం తగలబడుతూనే ఉంది. లేచి, దాన్ని రెండు చేతుల్తో పట్టుకొని, గోడకు తగిలించి, నెమ్మదిగా, మహా తేజస్సుతో ఇంట్లోకి నడిచాడు రషీద్. ఫాతిమా దగ్గరకు పరిగెత్తి, ఆమె మెడ చుట్టూ చేతులు వేసి "ఏక్ ఔర్ మరగయా, మామూ!" అన్నాడు ఉత్సాహంగా.

"యా అల్లా!" అంటూ తలపై కొట్టుకొంది అమ్మీ. కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా వంటగదిలోకి వెళ్ళింది.

"క్యావో పాగల్ హై!" హమీద్‌ని మిగతా పిల్లలు రోజూ అడుగుతారు. "నై! వో పాగల్ నై!" పెద్దగా అరుస్తాడు హమీద్. "ఉసకా ఆంఖే, కుచ్ పాగల్ లక్తా హై....", "నై.... వో పాగల్ నై...." అంటూ పెద్దగా అరుస్తూ వాళ్ళ ముఖాలపై గుద్దుతాడు హమీదు. సరిగ్గా అప్పుడే పరిగెత్తుకొంటూ మోటారు ఇంజనులా గుర్‌గుర్‌మని శబ్దంచేస్తూ వాళ్ళ మధ్యకు వస్తాడు రషీద్. పిల్లలగుంపును చూసి, వాళ్ళవైపు ప్రేమగా నవ్వుతాడు. నవ్వేటప్పుడు వాడి పళ్ళు తళుక్కుమంటాయి. తెల్లని పళ్ళపై ఎర్రగా రక్తపు మరకలు. "దేఖో, దేఖో వో అభీ అభీ కిస్కో మారా...!" అంటూ పిల్లల్లో ఒకడు పెద్దగా అరుస్తాడు. హమీద్‌కు దుఃఖం వేస్తుంది. పెద్దగా అరవాలనిపిస్తుంది. కళ్ళ ముందు ఎన్నెన్నో దృశ్యాలు. దుఃఖం, కోపం ఎగిసిరాగా, తమ్ముణ్ణి దగ్గరకు జరుపుకొని, ప్రేమగా భుజంపై చెయ్యి వేస్తాడు. రషీద్‌కి వింతగా తోచి, ఆ చెయ్యి బలమైన రాక్షస హస్తంలా తోచి, దాన్ని పక్కకు తోసి "ఆర్మీ సాబ్! ఆర్మీ సాబ్!" అని అరుచుకొంటూ రోడ్డుపైకి పరిగెడతాడు. అక్కడ నిలబడి ఆర్మీ ట్రక్కు కోసం ఎదురు చూస్తుంటాడు.

"ఆర్మీ సాబ్! ఆర్మీ సాబ్!" రషీద్ పొద్దుట నుంచి అరుస్తూనే ఉన్నాడు. ఫాతిమా అమ్మీ బయటకు వెళ్ళడానికి సిద్ధమైంది. సంచిలోని చెక్క తుపాకీని తెచ్చుకొని "ఛలోమా....." అంటూ బయల్దేరాడు హమీదు. సందు చివరిదాకా తోడు వెళ్తుంటాడు. వచ్చేటప్పుడు ఊరంతా ఒక గంటసేపు తిరిగి ఇమాజినరీ కెమెరాలో స్నాప్స్ తీసుకొంటూ మధ్యాహ్నానికి ఇంటికి చేరతాడు.

రోడ్లపై జనం చెల్లాచెదురుగా, హడావుడిగా, పరిగెత్తుతున్నట్లుగా, ఎందుకో అనీజీగా ఉంది హమీద్‌కి. జనం గుంపులుగా పరిగెత్తుతున్నట్లుగా ఉంటే వాడిలో కంగారు పుడుతుంది. వీధులపై ఎండ, సూర్యుడి రాక్షస కౌగిలిలా, ఇళ్ళు, అపార్టుమెంట్లు రంగు మాసిపోయి పురాతనమైన ఫోటో గ్రాఫ్‌లా. కాలి, నిర్మానుష్యమైన వీధులవైపు వెళ్ళాలని కోరిక కలుగుతుంది. ఎక్కడి నుంచో జుయ్‌మంటూ శబ్దం, వందలాదిగా జనం వెంట తరుముతున్న శబ్దం చెవుల్లో మోగుతుంది. హడావుడిగా ఇంటివైపు నడుస్తాడు హమీద్.

మధ్యాహ్నానికి ఇంటికి చేరాడు హమీద్. ఇల్లు, ఉదయం వదిలేసిన స్థితిలోనే ఉంది. చాలామంది పిల్లలు రోటీలు తింటున్నారు. కొద్దిమంది పిల్లలు నిద్రపోతున్నారు. రషీద్ కోసం వెతికాడు. వాడు ఇంటి వెనుక, వాడి గ్యారేజిలో, ప్రవక్తలా నిశ్చలంగా కూర్చొని ఉన్నాడు. రెండు రోటీలు తెచ్చి వాడి ముందు పెట్టాడు. అసహనంగా అటూ ఇటూ చూశాడు రషీద్. ఒక రోటీని సగం తిని, మిగిలినదాన్ని ముక్కలు చేసి గ్యారేజి అంతా చల్లాడు. సన్నటి చీమలబారు ఎక్కడి నుంచో రావటం గమనించాడు. వాడి ముఖంలో ఉత్సాహం. ఇమాజినరీ గోడలను వాటి చుట్టూ పేర్చాడు.

ఆర్మీ ట్రక్కు ఆట ఆడుతూ పిల్లలు పెరట్లోకి వచ్చారు. "సబ్ లోగ్ అందర్ జావో", "చలో చలో, లాస్ట్ వార్నింగ్!" అంటూ పెద్దగా అరుస్తూ రౌండ్లు వేస్తున్నారా పిల్లలు. రషీద్‌ని వదిలేసి ట్రక్కు ఆటలోకి జారిపోయాడు హమీద్. ఎందుకో ఈ ఆట నచ్చి, చీమల వేట ఆపి రషీద్ కూడా ఆటలోకి చేరాడు. "చలో, చలో" అని అరుస్తున్నారు పిల్లలు. "సబ్ ఠీక్ హై" అంటూ అరుచుకొంటూ ట్రక్కు ముందుకు సాగింది.

ఆకాశంలో ఒక నీలిమేఘం తళుక్కుమంది. సన్నటి చినుకులు. పిల్లలందరూ రోడ్డుపైనే ఉన్నారు. ట్రక్కు ఆట అయిపోయినాక క్యాంప్ ఆట మొదలుపెట్టారు. "లైన్ మే ఖడే రహో" అంటూ ఒక కుర్రవాడు బ్రెడ్‌ముక్కను వాళ్ళ మధ్య విసిరేస్తాడు. వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు తోసుకొంటూ, ఎవరు ఆ ముక్కను దొరకబుచ్చుకొంటే వాళ్ళు గెలిచినట్లు.

చినుకులు కాస్త పెద్దవయ్యేదాకా ఆట కొనసాగింది. హఠాత్తుగా వాన పెద్దదయింది. మహా క్రోధంగా నేలను తాకింది. పిల్లలందరూ ఇంట్లోకి పరిగెత్తారు. రషీద్ మాత్రం వానను ఆహ్వానిస్తున్నట్లుగా రోడ్డు మీదే నిలబడ్డాడు.

వీధులు చిన్న నదుల్లా మారాయి. బలమైన గాలి నీళ్ళను చెల్లాచెదురు చేస్తుంది. నీళ్ళలో ఈదుతూ రషీద్ నది మధ్య పడవ అయ్యాడు. దూరంగా ఖాకీ రెయిన్‌కోటు వేసుకొన్న పోలీసు కనబడి, భయంతో ఇంట్లోకి పరిగెత్తాడు. రషీద్ ముఖంలో భయం. మృత్యువేదో తోసుకొస్తున్నట్లుగా. వాన వీరంగం

చేస్తూనే ఉంది. ఆకాశం నీలపు రంగు పులుముకొని ఒంటరి రంగస్థలిలా ప్రత్యక్షమైంది.

రషీద్ శరీరం ఇంకా వణుకుతోంది. గదిలోకి వెళ్ళి రెండుమూడు దుప్పట్లు కప్పుకొన్నాడు. శరీరం ఇంకా వణుకుతూనే ఉంది. వెచ్చని శ్వాస, తీవ్రమైన జ్వరం. కళ్ళు మూసుకొని, తన శరీరాన్ని తానే భయంతో కౌగలించుకొని, కాసేపటికి వెచ్చగా జ్వలించే దుప్పట్లను లాగి వేసుకొని, లేచి నేలపైన ఒకానొక యోగ భంగిమలో నిలబడ్డాడు. నిర్వాణదశకు సూచికలా కళ్ళనిండా ఎర్రని జ్వాలలు. ముఖం భూగోళంలా ఉబ్బి, నడుంపై ఒక చెయ్యి, పాదాన్ని లేపి మోకాలిపై పెట్టి, మహా నిర్వాణమూర్తిలా ప్రత్యక్షమయ్యాడు.

చాలాసేపటి దాకా రషీద్ నిర్వాణమూర్తి భంగిమలోనే ఉన్నాడు. అగ్ని శ్వాసలు కక్కే వృషభమూర్తిలా. శరీరం చుట్టూ వెచ్చటి ఆవిర్లు. నిశ్చల సమాధి లోంచి ఒక్కో దృశ్యాన్ని బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్నాడు. దుఃఖమో, భయమో, మరణమో, లోపల కొలిమి మంట భగభగమంటోంది. "మారో, మారో..." అంటూ వందలాది జనం, భగ్గుమంటున్న అగ్నిగుండాలు, "రహమ్ కరో, రహమ్‌కరో బాబా!" ఏడ్చేది అమ్మే కదా, ఒక్కసారిగా శరీరంపై నుండి మంటలు లేచి "బచావో... బచావో...." అది అబ్బాయేనా - ఊహు ఏదీ గుర్తుకు రావటంలేదు. ఏవేవో దృశ్యాలు. వేటికవే విడివిడిగా, ఏ సంబంధం లేనట్లుగా. మెదడు అల్లకల్లోలంగా, గందరగోళంగా. దృశ్యాలు దృశ్యాలుగా, అందులోంచి హఠాత్తుగా ఒక ఉన్మాదం బయటకు తోసుకొచ్చింది.

వీధిలోని నీళ్ళు తగ్గి, రోడ్డుపైన మళ్ళీ పిల్లల గుంపు తయారైంది. హమీద్ తన చెక్క పిస్తోలుని అందరికీ ముట్టుకోవడానికి ఇచ్చాడు. పిల్లలు ఎక్కడ నుంచో ఒక గాలిపటాన్ని సంపాదించారు. ఎక్కువ దారంలేని ఆ గాలి పటాన్ని అపురూపంగా ఎగురవేస్తున్నారు.

రషీద్ నిర్వాణ ముద్రను వదలి మెల్లగా బయటకు నడిచాడు. శరీరం చుట్టూ అగ్నిశ్వాసలు కదలాడుతూనే ఉన్నాయి. మహా వృషభమూర్తిలా ఇల్లంతా అసహనంగా తిరిగాడు. వెనకనున్న గారేజివైపు వెళ్ళాడు. నీళ్ళలో వాడి ప్రయోగ శాల కొట్టుకుపోయింది. చీమలబారులు, రెండుమూడు బొద్దింకల శవాలు అన్నీ అదృశ్యమయ్యాయి. కోపం, అసహనంతో ఊగిపోయాడు.

మబ్బులు మళ్ళీ మూగాయి. గుంపుగా, దాడికి సిద్ధంగా ఉన్న సేనలా. రషీద్ ఇల్లంతా అసహనంగా తిరుగుతున్నాడు. కాళ్ళు అసంకల్పితంగా పరిగెత్తాలనే కోర్కెను ప్రకటిస్తున్నాయి. ఇంట్లోంచి పెరట్లోకి, పెరట్లోంచి రోడ్డు పైకి మహావేగంతో ఉన్మాదంతో పరుగు తీస్తూనే ఉన్నాడు. పరుగు మధ్యలో అడ్డుపడి

హమీద్ చేతుల్ని విదిలించుకొన్నాడు. పక్కనే ఉన్న లావాటి కర్రను హమీద్ పైకి విసిరాడు.

"రషీద్! ఏ క్యా పాగల్ హై!" అంటూ అరిచేడు హమీద్. క్షణంసేపు బుసలు కక్కే ముఖాన్ని ముందుకు చాపి, ముఖంతో హమీద్‌ని ఫట్‌మని కుమ్మాడు.

దృశ్యాలు వెంటాడుతున్నాయి రషీద్‌ని. పెట్రోలు డబ్బాలతో వెంటాడు తున్నట్లుగా. వందలాది అడుగుల శబ్దం. శంఖనాదాలు. ఓంకారాలు. "మారో, మారో...." అంటూ అరుపులు. భయంతో వణికిపోయాడు.

ముఖాన్ని నిలువుగా సాగదీసి, మహా ఉన్మాద వేగంతో ముఖంలోంచి పళ్ళను ముందుకులాగి, శత్రువు మెడను పళ్ళ మధ్యన బిగించి -

"రషీద్! మేహు, మేహురే, చోడో....!" హమీద్ అరుస్తూనే ఉన్నాడు. రషీద్ శరీరం ఇంకా ప్రకోపిస్తూనే ఉంది. పూర్తి స్థాయి నిర్వాణమూర్తిలా మారి పోయాడు. శరీరం మొత్తం శక్తి స్వరూపమై. శక్తి మొత్తాన్ని తన పళ్ళ దగ్గర కేంద్రీకరించి -

పళ్ళు లోతుగా దిగబడ్డాయి. రక్తం బుసబుసమని పొంగింది. హమీద్ దీనంగా అరుస్తున్నాడు. రషీద్ మాత్రం శత్రు నిర్మూలనం అనే ఒకే ఒక ఏకైక వాంఛతో తన పళ్ళను మరింత లోతుగా, లోతుగా....

* * *

కథ పూర్తిచేసి గాఢంగా నిట్టూర్చాడు. మృతస్వప్నాల లోంచి హఠాత్తుగా మేల్కొన్నట్లుగా తోచింది. అర్ధరాత్రి చీకటి ఇంకా చిక్కనైంది. పైనుంచి జారిపడు తున్న వెలుతురు కళ్ళపైన బడి జిగేలుమంది. బయట ఎక్కడో మృత్యువును ధిక్కరించగలిగే మహావృక్షాలు ఊగుతున్న సవ్వడి. మూగవాళ్ళ నాటకంలా, స్టూడియో అంతా నిశ్శబ్దంగా ఉంది. ముఖాలపై వింతవింత భావనలు.

బయట కూర్చున్న బాలెడ్ గాయకులు ఒక పాట ఎత్తుకొన్నారు. అజ్ఞాత భూముల్లోంచి, నిసర్గంగా, నిర్మలంగా చెలరేగిన మార్మిక రాగంలా ఉంది ఆ పాట. వాళ్ళు నోటితో కాకుండా శరీరం మొత్తంతో పాడుతున్నట్లుగా ఉంది. ఇది రాత్రే. ఈ రాత్రిలోకి నదుల హోరును, వృక్షాల పెను విసురును నింపింది ఆ పాట.

ఎక్కడి నుంచో ఇద్దరు పిల్లలు ఆ చప్పుడుకు కాబోలు తమ నిద్రను వదిలి మామధ్యకు వచ్చి కూర్చున్నారు. సమస్తమైన జ్ఞాపకాలు చెరిపి వేయబడి, వాళ్ళ ముఖాలు నిశ్చలమైన యోగనిద్రలో ఉన్నట్లుగా తోచింది. ఎందుకో

ఉలికిపాటు. ముఖ్యంగా ఆ ఇద్దరిలో కాస్త చిన్నగా ఉన్న పిల్లవాడి ముఖం చూస్తే వింత గగుర్పాటు కలిగింది. నా కథలోని పాత్ర అట్లా గాఢమైన రాత్రిలోకి నడిచి రాలేదు కదా అనిపించింది.

బాలెడ్ గానం కొనసాగుతూనే ఉంది. స్వర్గాలు కూలిపోతున్నట్లు, మహా శూన్యంలో ప్రయాణిస్తున్నట్లు, వాళ్ళు పాడుతూనే ఉన్నారు. కుర్రవాళ్ళలో ఒకడు పెయింటింగ్స్ పక్కనున్న ఎర్రని గాలిపటాన్ని అందుకొని, కిటికీలోంచి బయటకు వదిలాడు. చీకటిలోంచి గాలిపటం ఎర్రగా మిలమిలలాడుతోంది.

పాట ఆగిపోయింది కానీ, సన్నని రుంజలాంటి వాయిద్యం ఝుమ్ ఝుమ్మని మోగుతోంది. హఠాత్తుగా కోమలి "కథలో కావాలని ఒక ఉద్రిక్త వాతావరణాన్ని కూరినట్లు అనిపిస్తోంది. సంఘటనలకు అవసరాన్ని మించిన మాంసాన్ని, రక్తాన్ని కూరినట్లు లేదా?" అంది గొప్ప క్రిటిక్‌లా.

ఆమె మాటల్ని ఎవరూ పట్టించుకొన్నట్లు లేదు. మరో బాలెడ్ పాట మొదలైంది. మృతవీరుల కోసం పాడే వీరగాథ అది. ఎప్పటిదో గత శతాబ్దానికి చెందిన పాటలా కొద్దిగా గ్రాంధికము, కొద్దిగా తెలంగాణా యాస మిళితమైనట్లుగా ఉంది. పాట మధ్యలో రెండో కుర్రాడు లేచి భారంగా నడుస్తూ అహమ్మదు దగ్గరకు వచ్చి, అతని వడిలో తలపెట్టుకొని పడుకొన్నాడు.

"నీ కథలోని ఇద్దరు పిల్లల పోలికలు వీళ్ళలో కనిపిస్తున్నాయి కదూ!" అంది కోమలి మర్మంగా నవ్వుతూ. కిటికీలోంచి గాలిపటం ఎర్రగా రెపరెపలాడుతోంది.

తలలు విరబోసుకొన్న మహావృక్షాల నాట్యంలా బాలెడ్ గీతం కొనసాగుతోంది.

ఇంకా మనోహర్, మూర్తి, శివరామ్‌ల కవితలు వినాల్సి ఉంది.

కొన్ని గుజరాత్ కవితల అనువాదాలు కూడా వినాలి.

ఈ ఇద్దరు పిల్లల కథలను అహమ్మదు నోట వినాల్సి ఉంది. మరి ఈ రాత్రి సరిపోతుందో, లేదో ?

*- ఆదివారం వార్త, 27 అక్టోబరు 2002*